సాక్షి నిర్మల్

బుధవారం। 19। మార్చి। 2025



పిచ్చుకలతో జీవ వైవిధ్యం 8లో▸
జీవ వైవిధ్యంలో పిచ్చుకలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. భూమిపై ప్రతీజీవి మనుగడకు పిచ్చుకలే కారణం. 20న పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:23	గురు : 5:04

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38.6 /24.8
వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చెరువుల మరమ్మతులకు నిధులివ్వండి



మాట్లాడుతున్న పి.రామారావు పటేల్

భైంసాటౌన్/ బాసర/ ముధోల్: వానాకాలంలో భారీ వర్షాలకు ముధోల్ నియోజకవర్గంలో వంద వరకు చెరువులు ధ్వంసమయ్యాయని, మరమ్మతుల కోసం నిధులివ్వాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండుతున్నాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హిప్నెల్లి చెరువు మరమ్మతులకు రూ.60 లక్షలు, దొడర్న చెరువుకు రూ.90 లక్షల నిధులు మంజూరైనా ఫైనాన్స్ క్లియరెన్స్ రాలేదని పేర్కొన్నారు. ముధోల్ మండలం ఎడ్‌బిడ్‌లో కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్ రోడ్డును వంద మీటర్లు తవ్వేశారని, అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ రూ.17.70 లక్షల ఉపాధిహామీ నిధులు మంజూరు చేశారని తెలిపారు. అయితే వర్షాకాలంలో రోడ్డుపై మొరం వేయించగా రోడ్డు ఎత్తుకు పెరిగిందన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు దీనిని తవ్వించారని పేర్కొన్నారు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లు వెనక్కి తీసుకుందని, తిరిగి మంజూరు చేయాలని కోరారు. త్వరలో గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

రెమ్యునరేషన్ చెల్లించాలి

లక్ష్మణచాంద: గత నవంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేను జిల్లాలోని ఉద్యోగులు ఉపాధ్యాయులు విజయవంతం చేసి జిల్లాను మొదటి వరుసలో ఉంచారని, అయినా వారికి రెమ్యునరేషన్ చెల్లించలేదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్, అశోక్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్ విడుదల చేయాలని కోరారు.

మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్



నియామకపత్రం ఇస్తున్న రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్

నిర్మల్ టౌన్: జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా బైండ్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర చైర్మన్ సలీం ఆదేశానుసారం మార్గదర్శకాలను అనుసరిస్తూ.. ముందుకు వెళ్తానన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఈహెచ్‌ఎంఎస్ పోర్టల్‌పై శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: ఈహెచ్‌ఎంఎస్‌పై వైద్యాధికారులు, నర్సింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. వీరికి జిల్లా డాటా మేనేజర్ గంగాధర్, సబ్ ఇంజనీర్స్ రమణ, సంతోష్ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ రోగులకు సంబంధించిన వివరాలను ఈహెచ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా ఆ వివరాలను ఉపయోగించుకుని మరింత మెరుగైన సేవలె అందించవచ్చని తెలిపారు. శిక్షణలో జిల్లాలోని వైద్యాధికారులు, జిల్లా మాస్ మీడియా ఇన్‌చార్జి బారె రవీందర్, నర్సింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

లెక్కలోకి తీసుకుంటరా..!

- బడ్జెట్‌లో జిల్లాకు నిధులిస్తారా..!
- ప్రతిసారీ ఆశనిరాశల పద్దులే..
- ఈసారైనా జిల్లావైపు చూడాలి
- పనులు పూర్తిచేయాలి
- అభివృద్ధికి చేయూతనివ్వాలి



బడ్జెట్.. అనగానే జిల్లాకు నిధులేమైనా వస్తాయా..!? అన్న ఆసక్తి జిల్లావాసుల్లో ఉంటుంది. కానీ ప్రతీ బడ్జెట్‌కు ముందు ఆశ, ఆ తర్వాత నిరాశ కంటిన్యూ అవుతోంది. ఏళ్లు గడిచిపోతున్నా.. జిల్లా అభివృద్ధికి సరిపడా నిధులు మాత్రం రావడం లేదు. మరోవైపు బాసర దేవస్థానానికి ఇచ్చిన రూ.42 కోట్లనూ సర్కారు వెనక్కి తీసుకుంది. జిల్లాలో రాజకీయ పరిస్థితుల పేరు చెప్పి, ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై చిన్నచూపు చూడటం సరికాదన్న వాదనా ఉంది. ఈసారి బడ్జెట్‌లో జిల్లాను లెక్కలోకి తీసుకోవాలని, పెండింగ్ పనుల పూర్తితోపాటు కొత్తగా అభివృద్ధి పనులకు దండిగా నిధులు కేటాయించాలని జిల్లా డిమాండ్ చేస్తోంది. – నిర్మల్

కావాల్సినవెన్నో..

- కడెం ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో రూ.9 కోట్లకు పైగా నిధులిచ్చారు. సంబంధిత పనులు పూర్తయ్యాయి. ఇక పూడికతీత తోపాటు పూర్తిస్థాయిలో గేట్లను మార్చాల్సిన అంశంపైనా దృష్టిపెట్టాల్సిన అవసరముంది. ప్రాజెక్టు కాలువలు కూడా చాలాచోట్ల దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.
- కడెం, దస్తురాబాద్ మండలాలకు సాగునీటిని అందించేలా లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో సర్వేచేశారు. కానీ ఇప్పటి వరకు దానిపై ఎలాంటి చలనం లేదు.
- సారంగపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు మరమ్మతులకు గతంలో రూ.3 కోట్ల వరకు ప్రతిపాదించినా నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. స్వర్ణనదిలో మంజూరైన చెక్‌డ్యామ్‌లనూ నిర్మించడం లేదు.
- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో 27, 28 ప్యాకేజీల కింద లక్ష ఎకరాల సాగుకు చేపట్టిన పనులు ఇంకా పూర్తికాలేదు. ప్రధానంగా ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి 28 ప్యాకేజీ పనులను మధ్యలోనే నిలిపివేశారు. గత ప్రభుత్వం హడావుడిగా 27వ ప్యాకేజీని ప్రారంభించినా.. ఒక్కరోజుకే పరిమితమైంది. ఇప్పటికీ కాలువల పనులు కొనసాగుతూనే ఉన్నాయి.
- జిల్లాలో బాసర నుంచి కడెం వరకు జిల్లా కేంద్రం సహా ఎన్నో పర్యాటక ప్రాంతాలు, దర్శనీయ ఆలయాలు ఉన్నాయి. కానీ..ఎక్కడా పర్యాటకపరంగా అభివృద్ధి చేయడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా పర్యాటకాభివృద్ధి కోసం నిధులు కేటాయించడం లేదు.
- ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- నిర్మల్ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజీ సహా అన్నిరకాల వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలి. మెడికల్ కాలేజీ భవనాన్ని త్వరగా నిర్మించాలి.
- భైంసాలో ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చడంతోపాటు నూతన భవనాన్ని నిర్మించాలి. అలాగే దేవస్థానంతోపాటు, ట్రిపుల్‌ఐటీని బాసరలో వందపడకలతో ప్రత్యేక ఆస్పత్రిని నిర్మించాల్సిన అవసరం ఉంది.
- జిల్లాలో క్రీడాప్రాంగణాలు ఉన్నట్లే కానీ.. ఎక్కడా కనీసం ఆడుకోవడానికి సరైన వసతులు లేవు. చాలా క్రీడలకు కోచ్‌లు లేక ఆసక్తి ఉన్న పిల్లలు పక్కజిల్లాల్లో నేర్చుకోవడానికి వెళ్తున్నారు.
- రెండుమూడేళ్లుగా భారీ వర్షాలకు చాలావరకు చెరువులు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలి.
- జిల్లాలో ఇప్పటికీ చాలా ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థల్లోనే కొనసాగుతున్నాయి. వీటిపై ఈ బడ్జెట్‌లో దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.
- మామడ మండలంలోని కమల్‌కోట్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేసినా నిధులు మాత్రం విడుదల చేయడం లేదు.
- జిల్లాకేంద్రంలో పీజీ కళాశాలను తిరిగి రెగ్యులర్‌గా క్లాసులు ఉండేలా ప్రారంభించాలి.
- బాసర ట్రిపుల్‌ఐటీకి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కొన్నేళ్లుగా ప్రతిపాదనలు వెళ్తున్నా.. నిధులు మాత్రం రావడం లేదు. ప్రభుత్వాలు పెద్దగా తమను పట్టించుకోవడం లేదన్న భావన విద్యార్థుల్లో ఉంది.
- నిర్మల్, భైంసా పట్టణాల్లో ట్రాఫిక్ పెరిగింది. ఈనేపథ్యంలో ఆయా పట్టణాల్లోనూ ఫ్లైఓవర్, రింగ్‌రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది.
- బాసర జ్ఞానసరస్వతీ దేవస్థానానికి గత ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించగా, అందులో కేవలం రూ.8 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగతా రూ.42 కోట్లు ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఇప్పటికీ ఆలయ అభివృద్ధికి ఎలాంటి నిధులు, చర్యలు చేపట్టడం లేదు.
- జిల్లాలో ఇప్పటికీ ఒక్క పరిశ్రమ కూడా ప్రారంభం కాలేదు. ఇథనాల్, ఆయిల్ పామ్ మధ్యలోనే నిలిచిపోయాయి. బాసరలో ఏర్పాటు చేస్తామన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ముచ్చట అక్కడే ఆగిపోయింది. అక్కడ భూమి ఉన్నా.. పరిశ్రమలను ఏర్పాటు చేయడం లేదు.
- నిరుద్యోగ యువతకు సరైన శిక్షణ కేంద్రాలు లేవు. జిల్లాకేంద్రంలో మినహా భైంసా, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఆధునాతన లైబ్రరీలు అందుబాటులో లేవు. స్వయం ఉపాధి పొందేందుకూ కనీసం ప్రోత్సాహం లేదు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 9,129 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరికోసం 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షల ప్రశ్న, జవాబు పత్రాల తరలింపు సమయంలో పోలీసు భద్రతను, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించాలని, ప్రతీ పరీక్ష కేంద్రంలో తాగునీరు, వైద్య సిబ్బంది, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రహరీ లేని పరీక్ష కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా పరీక్షల సమయానికి తగ్గట్లుగా ఆయా మార్గాల్లో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

విద్యార్థుల్లో మానసిక స్థైర్యం నింపాలి..
అనంతరం పదో తరగతి పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షలను రాయబోవు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసే విధంగా వారిలో మానసికస్థైర్యం నింపాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో పి.రామారావు, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు పద్మ, లింబాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సమస్య, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కూలీలకు ఉపాధి పనులు తదితర అంశాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, షెడ్యూల్ ప్రకారం ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని సూచించారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. పశువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చేతి పంపులు, బోరు బావులకు మరమ్మతులు చేయించాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాల గుర్తింపును వెంటనే పూర్తిచేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగివున్న ప్రతీ ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున, ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈజీఎస్ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. అనంతరం పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాల పరిధిల్లోని ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రజలు దరఖాస్తులు చేసుకున్న ఆదాయ, కుల, నివాస తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయొద్దని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వర్క్‌షాప్

- జాతీయ నిర్మాణ సంస్థ, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు



నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో భవన నిర్మాణరంగం కార్మికులకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కల్పించాలని పలువురు కార్మిక సంఘ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జాతీయ భవన నిర్మాణం అకాడమీ, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆరు రోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల మాట్లాడుతూ.. భవన నిర్మాణరంగంలో స్థానిక మేస్త్రీలు, కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో అవకాశం కల్పించాలని సూచించారు. స్థానిక కార్మికులు, మేస్త్రీలకు నైపుణ్య శిక్షణ అందిస్తూ తక్కువ ఖర్చుతో స్థానిక వనరులను వినియోగించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టవచ్చని సూచించారు. మరో అతిథి అసిస్టెంట్ ఇంజనీర్ హెచ్‌ఏ.షరీఫ్ మాట్లాడుతూ.. స్థానిక కార్మికులకు శిక్షణ ద్వారా నిర్మాణ కొలతలు, మౌలిక ఇంజనీరింగ్ సామర్థ్యాలను నేర్చుకుని న్యాక్ సంస్థ ద్వారా ధ్రువీకరణ పత్రం పొందితే భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు రమేశ్, మహేశ్, జిల్లాకు చెందిన పలువురు మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారందరికీ టీషర్టులు, బ్యాగులు, హెల్మెట్‌లు అందించారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్, హైదరాబాద్ ద్వారా నిరుద్యోగ బీసీ యువతీ యువకులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట్ హైదరాబాద్‌లో ఉచిత డ్రైవింగ్ కోర్సులో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డ్రైవింగ్ శిక్షణ హెవీ వెహికల్ లైట్ వెహికల్ ఉంటుందని, శిక్షణ కాలపరిమితి 38 రోజులని పేర్కొన్నారు. శిక్షణ తర్వాత పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం టీపీ అండ్ జడ్‌ఎస్‌టీసీ ద్వారా అందించబడుతుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్‌కు 18 నుంచి 45 సంవత్సరాలు, హెవీ మోటార్ వెహికల్ కు 20 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండాలని, 8వ తరగతిలో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని పేర్కొన్నారు. ఆధార్, కుల, ఆదాయ (గ్రామీణ ప్రాంతం రూ.1.50 లక్షలు పట్టణ ప్రాంతం రూ.2 లక్షలు), 3 పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ బీసీ యువతీ యువకులు అభ్యర్థులు దరఖాస్తు /పత్రాలను వారివారి సంబంధిత జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 31వ వరకు పూర్తి సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగులు, వెనుకబడిన తరగతుల యువతీ, యువకులు ట్రాన్స్ జెండర్లు వినియోగించుకోవాలని తెలిపారు.

పీఎంశ్రీతో ఐసీడీఎస్ నిర్వీర్యం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్
- రెండో రోజు కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళన



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నిర్మల్‌చైన్‌గేట్: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తలపెట్టిన 48 గంటల మహాధర్నా రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీలు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి సామూహిక భోజనాలు చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టరేట్ ప్రాంగణంలో బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రతీనెల ఒకటో తారీకు జీతాలు, ఎండాకాలంలో మే నెల మొత్తం సెలవులు ప్రకటించాలన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రవర్తిస్తుందన్నారు. ఐసీడీఎస్‌కు వ్యతిరేకంగా కేంద్రం చేసిన నిర్ణయాలకు రాష్ట్రంలో అమలు చేయాలని చూడడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయంతో పేద ప్రజలకు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు తీవ్రమైన నష్టం కలిగించాయన్నారు. ఎన్‌ఈపీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. మొబైల్ అంగన్‌వాడీ సెంటర్ రద్దుచేసి ఐసీడీ సేవలు పాత పద్ధతిలో కొనసాగించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ కు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టో పొందుపర్చిన హామీల ప్రకారం మినీ టీచర్ నుంచి మెయిన్ టీచర్‌గా పదోన్నతి పొందిన అంగన్‌వాడీ టీచర్లకు పది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా ఉపాధ్యక్షులు గంగామణి, రజియా విజయ, ప్రసాద, భాగ్య,వనజ, జిల్లా సహాయ కార్యదర్శి, భాగ్య, రేష్మ, విజయ, వందన, దేవిక లావణ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పొలానికి భగీరథ నీరు



కడెం మండలం లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో ఓ రిటైర్డ్ ఉద్యోగి భగరీథ నీటినే పంటలకు పారిస్తున్నాడు. భగీరథ పైపులైన్ ఔట్ ఫ్లోకు మరో పైపు బిగించి సమీపంలోని తన పంటకు అందిస్తున్నాడు. జన్నారం మండలం మొర్రిగూడెం గ్రామానికి చెందిన రాజేశ్వర్ అనే రిటైర్డ్ ఉద్యోగికొన్ని రోజులుగా రెండెకరాల పొలానికి భగీరథ నీటినే పారిస్తున్నాడు. అయినా భగీరథ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. – కడెం

నీటి కోసం పాట్లు



పంప్‌హౌస్ బ్యాక్‌వాటర్‌లో బిగించిన మోటార్లు

దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామ శివారులో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌ను బీడు భూములకు మళ్లించేందుకు గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు 27 ప్యాకేజీలో భాగంగా లక్ష్మీనర్సింహ పంప్‌హౌస్ నిర్మించింది. 2023లో దీనిని హడావుడిగా ప్రారంభించారు. కానీ కాలువల నిర్మాణం పూర్తికాక నిరుపయోగంగా ఉంటోంది. అయితే పంప్‌హౌస్ వరకు వచ్చే నీటిని రైతులు చేలకు మళ్లించుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. రెండు మూడు కిలోమీటర్ల దూరం వరకు పైపులు వేసుకుని బ్యాక్ వాటర్‌లో మోటార్లు బిగించి చేలకు పారిస్తున్నారు. డిసెంబర్‌లో బ్యాక్‌వాటర్ నిండుగా ఉండగా, ప్రస్తుతం తగ్గిపోవడంతో మోటార్లను కిందకు దింపుతున్నారు. - సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్



పైపులు సరిచేస్తున్న రైతు



కెనాల్‌లో మోటార్‌కు మరమ్మతు చేయిస్తున్న రైతు



మక్క చేనుకు నీరు పారిస్తున్న రైతు రాజారెడ్డి

క్లుప్తంగా

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనికి చెందిన కొత్తగట్టు శ్రీనివాస్‌పై దాడి చేసిన శ్రీరాముల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కొత్తగట్టు పద్మ, శ్రీరాముల శ్రీనివాస్ వరుసకు అక్కా,తమ్ముడు అవుతారు. ఇద్దరికీ కలిసి ఏసీసీ సమీపంలో ఒక ఇళ్లు ఉంది. పద్మకు తెలియకుండా గోడ నిర్మాణం చేశాడు. దీనికి అయిన ఖర్చులో సగం ఇవ్వాలని ఈ నెల11న శ్రీనివాస్ పద్మపై దాడి చేసేందుకు యత్నించగా అడ్డుకున్న ఆమె భర్త శ్రీనివాస్‌పై కుర్చీతో దాడి చేసి గాయపరిచాడు. మంగళవారం పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరాముల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు అప్పుగా తీసుకున్న రూ.12 లక్షలు చెల్లించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద స్థానిక రెడ్డికాలనీకి చెందిన తోట రామకృష్ణారెడ్డి తన అవసరం నిమిత్తం రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో ష్యూరిటీగా చెక్కు అందజేశాడు. అప్పు తీసుకున్న గడువు తీరిన తర్వాత సదరు చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో 2017లో జగన్నాథ్‌రెడ్డి కోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం న్యాయమూర్తి నిరోష ఏడాది జైలుశిక్షతో పాటు తీసుకున్న అప్పు చెల్లించాలని తీర్పునిచ్చారు.

చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

లక్సెట్టిపేట: చోరీ కేసులో ఒకరికి మూడు నెలల తొమ్మిది రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన గంగాధర్ విట్టల్ గైక్వాడ్ 2024 అక్టోబర్ 27న పట్టణంలోని ఆంధ్రాకాలనీలోని రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు, ఇత్తడి సామగ్రి దొంగిలించాడు. బాధిత మహిళ లక్ష్మి ఫిర్యాదు మేరకు అదనపు ఎస్సై రామయ్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నేరం రుజువు కావడంతో స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మంగళవారం పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




గాయాలపాలైన ఖాదీర్, సత్యనారాయణ

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఖాదీర్, కుభీర్ మండలానికి చెందిన సత్యనారాయణ మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఖానాపూర్ వైపు నుండి నిర్మల్ వెళ్తుండగా నిర్మల్ నుండి కనకాపూర్ వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఖాదీర్, సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పిచ్చుకలతో జీవ వైవిధ్యం

• రేపు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



నస్పూర్: పిచ్చుకల సంరక్షణతోనే జీవ వైవిధ్యం కొనసాగుతుందని నేటి ఆధునిక సమాజంలో ఎంతమందికి తెలుసు. ఈ భూగోళంపై నివసించే ప్రతీ జీవి, మానవునితో పాటు సకల ప్రాణుల మనుగడకు, జీవవైవిధ్యానికి, ఆహార ఉత్పత్తికి సైతం పిచ్చుకల పరపరాగ సంపర్కమే కారణం. కనుమరుగవుతున్న కమనీయ పిచ్చుకల జాతులను కాపాడుకోకుంటే తీరని నష్టం వాటిల్లుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. పంట చేలల్లో, పల్లె ముంగిట్లో ధాన్యపు రాశుల్లో కిలకిల మంటూ సందడి చేసే పిచ్చుకలు మానవుడు పెంచుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానంతో వాటి మనుగడకు శాపంగా మారిందని సెల్ తరంగాల రేడియేషన్, కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుండి కనుమరుగవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యోగేశ్వర్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన పిచ్చుక గూళ్లు

తల్లి ప్రేమకు నిదర్శనం

జనావాసాలతో మమేకమై జీవిస్తున్న పిచ్చుకలు మెత్తని పీచు వంటి వాటితో గూడు కట్టుకోవడం, అందులో గుడ్లు పెట్టడం, వాటిపై పొదగడం, పుట్టిన పిల్లలకు ఆహారాన్ని నోటితో తెచ్చి అందించడం, వాటికి రెక్కలొచ్చి ఎగిరేంత వరకు జాగ్రత్తగా కాపాడడం వంటి దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఆదర్శవంతమైన పిచ్చుకల అన్యోన్యతను, తల్లి ప్రేమకు మరోపేరుగా గుర్తించిన ప్రపంచ దేశాలు పిచ్చుకల సంరక్షణపై అవగాహన కల్పించడానికి ప్రతీ సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాయి. పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా బిల్లును సైతం విడుదల చేసిందని పర్యావరణ వేత్తలు గుర్తు చేస్తున్నారు.

పిచ్చుకలను బతుకనిద్దాం

పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే మానవ మనుగడపై తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది. పిచ్చుకల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత. వాటి ఆవాసం కోసం ఇంటి ఆవరణలో వెదురు, కర్ర, అట్టడబ్బాలతో గూళ్లు తయారు చేయాలి. మట్టిపాత్రలో నీరు, ధాన్యపు గింజలు పోసి ఉంచాలి. ఇంటి ముందు రసాయనాలు లేని బియ్యపు పిండి ముగ్గు వేస్తే వాటికి ఆహారంగా ఉపయోగపడుతుంది. పిచ్చుకలు పదికాలాల పాటు పదిలంగా బతికేలా మానవులుగా మనవంతుగా సహకరిద్దాం.. పిచ్చుకలను బతుకనిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం.

– గుండేటి యోగేశ్వర్, పర్యావరణ వేత్త, రిటైర్డ్ టీచర్, నస్పూర్

కొలిక్కిరాని హమాలీల వివాదం

• రెండో రోజూ జైనథ్‌లో నిలిచిన శనగ కొనుగోళ్లు



మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగిన రైతులు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీల వివాదం ఎటూ తేలలేదు. రెండోరోజు మార్కెట్ యార్డులో శనగ కొనుగోళ్లు జరగలేదు. బుధవారం సైతం ప్రారంభమయ్యేలా కన్పించడం లేదు. ఇద్దరు గుత్తేదారుల మధ్య నెలకొన్న లొల్లి రైతుల పాలిట శాపంగా మారింది. ఆందోళనను సద్దుమణిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని జైనథ్ మార్కెట్‌యార్డుకు పంపించింది. సదరు అధికారులు దీనిపై ఎటూ తేల్చకుండానే వెనుదిరిగారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు ఎవరికి ఏమి చెప్పే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమి లేక ఉన్నాతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని అక్కడి నుంచి వెనుదిరిగారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ ఏడీ గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, డీసీవో మోహన్‌లు మార్కెట్ కార్యదర్శి దేవన్నకు సూచించారు. అక్కడున్న కాంటాల్లో ఇద్దరు గుత్తేదారులకు చెరిసగం చూసుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. అయితే సదరు గుత్తేదార్లు దీనిపై అంగీకరించేందుకు ముందుకు రాలేదు. జైనథ్ వ్యవసాయ మార్కెట్ అధికారులు కొత్త గుత్తేదారుకు లైసెన్స్ ఇచ్చినట్లుగా సమాచారం. ఆయనకే హమాలీల బాధ్యతలను పూర్తిస్థాయిలో కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే గత 15ఏళ్లుగా బిహార్‌కు చెందిన గుత్తేదారే హమాలీలను సరఫరా చేస్తున్నారు. తాను ఎలాంటి తప్పు చేయకున్నా ఉన్నఫలంగా తనను ఏ విధంగా తొలగిస్తారని వాపోతున్నారు. ఇద్దరు గుత్తేదార్లను పిలిచి నచ్చజెప్పినప్పటికి వారి మధ్య సయోధ్య కుదరలేదు. శనగ పంటను విక్రయించేందుకు తీసుకొచ్చిన రైతులు కొనుగోళ్లు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీ కాంట్రాక్టర్ల లొల్లి కారణంగా తమను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నాతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొన్నారు.

నా బిడ్డను మా అమ్మకు అప్పగించండి..!

• నా చావుకు భార్య, అత్తమామలే కారణం
• సెల్ఫీ వీడియోలో వెల్లడి
• యువకుడి ఆత్మహత్య



అంజన్న (ఫైల్)

దండేపల్లి: 'నా చావుకు భార్య, అత్తమామలే కారణం.. నా బిడ్డను మా అమ్మకు అప్పగించండి..' అంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియోలో పేర్కొంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాంద్రపు అంజన్న(26) కాసిపేటకు చెందిన శిరీషను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి వారం రోజుల క్రితం కూతురు జన్మించింది. దీంతో సోమవారం కూతురిని చూడడానికి అంజన్న కాసిపేటకు వెళ్లగా.. భార్య, అత్తమామలు దూషించారు. దీంతో ఆవేదనకు గురైన అంజన్న ఇంటికి వచ్చి సెల్ఫీ వీడియో తీసుకుంటూ తన ఆత్మహత్యకు కారకులు అంటూ భార్య, అత్తమామలు, పెద్దమనుషులు పలువురి పేర్లు పేర్కొన్నాడు. రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



రాకేశ్ (ఫైల్)

జైపూర్: ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలోని శివ్వారంలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల మేరకు శివ్వారం గ్రామానికి చెందిన గెల్లు పోశక్క, దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు రాకేశ్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. కొంతకాలం ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసి మానేశాడు. కొద్దిరోజులుగా ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో అతని తల్లిదండ్రులు ఏదైనా పని చేసుకోవాలని, లేదా వ్యవసాయం చూసుకోవాలని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పంట పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కరణ్‌సింగ్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌నగర్ కాలనీకి చెందిన చవాన్ కరణ్‌సింగ్ (22) మంగళవారం అదే కాలనీకి చెందిన స్నేహితులు సయ్యద్ అజీమ్, నర్సింగ్‌తో కలిసి బైక్‌పై సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జిల్లా కేంద్రంలోని గండి రామన్న ఆలయ సమీపంలోకి రాగానే టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ముగ్గురూ కిందపడిపోయారు. కరణ్‌సింగ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సయ్యద్ అజీమ్, నర్సింగ్‌ను 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చేపల వల చుట్టుకుని మత్స్యకారుడు..



సాయికుమార్ మృతదేహం

సోన్: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల మేరకు మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన సక్కిన్ సాయికుమార్ (28) మంగళవారం వృత్తిరీత్యా చేపలు పట్టేందుకు సరస్వతి కెనాల్‌కు వెళ్లాడు. కాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలానికి చెందిన కుమ్ర భక్కు (46) మంగళవారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తుండగా మారుతిగూడ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో భక్కుకు తీవ్రగాయాలు కావడంతో అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ గమనించి 108కు సమాచారం అందించగా ముందుగా ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా కొఠారి గ్రామానికి చెందిన రాథోడ్ జాముబాయి (55) మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 16న రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు.

చోరీ కేసులో మహిళ రిమాండ్

లక్సెట్టిపేట: ఈనెల 16న పట్టణంలోని గోదావరి రోడ్‌లో నివాసముంటున్న కొత్త శ్యామల ఇంట్లో చోరీకి పాల్పడిన వసంత అనే మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అదే కాలనీకి చెందిన వసంత బాధితురాలు శ్యామల ఇంట్లో ఎవరూలేని సమయంలో చొరబడి ఆమెను బాత్‌రూంలోకి నెట్టివేసి మెడలోని గొలుసు లాక్కుని పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి గొలుసును స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళను సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో కడమంచి లక్ష్మణ్ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. నిరుపేద ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు ఇంటి వెనకాల ప్రహరీ వద్ద నిలువ ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

• జిల్లా వ్యాప్తంగా 70 ఎకరాల్లో సాగు
• అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులు
• వేసవిలో పంటకు డిమాండ్

కర్బూజ సాగు..లాభాలు బాగు



ఒతుకులపల్లిలో సాగుచేసిన కర్బూజ పంట

చెన్నూర్‌రూరల్: పంట మార్పిడి విధానం అవలంభిస్తే అధిక లాభాలు ఉంటాయి. ఎల్లప్పుడూ ఒకే రకం పంటలు సాగుచేస్తే భూసారం దెబ్బతింటుంది. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంట మార్పిడికి ముందుకు వస్తున్నారు. ఇందుకు ఉదాహరణ కర్బూజ సాగు. ఇతర పంటలు సాగు చేసి విసిగి పోయిన కొందరు రైతులు ఇందుకు భిన్నంగా ఆలోచించి వేసవిలో కర్బూజ సాగు వైపు దృష్టి సారించారు. వేసవిలో మార్కెట్‌లో కర్బూజకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ పంట వైపు దృష్టి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 70 ఎకరాల్లో కర్బూజ పంట సాగవుతోంది. జిల్లాలోని చెన్నూర్, భీమారం, బెల్లంపల్లి, దండేపల్లి, కోటపల్లి, వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. నవంబర్, డిసెంబర్ నెలలు సాగుకు అనుకూలం. గింజలు నాటిన సమయం నుంచి మూడు నెలల వరకు పంట కాపుకు వస్తుంది. ఎకరాకు సుమారు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కిలోకు రూ.12 నుండి 15వరకు ధర పలుకుతుంది. ఎకరానికి సుమారు రూ.60 వేల నుంచి 70వేల వరకు లాభం వస్తుంది. స్వయంగా అమ్మితే లాభం మరింత ఎక్కువగా ఉంటుంది.

చీడపీడల నివారణకు చర్యలు

ఈ పంటను కాయ తొలుచు పురుగు (పండు ఈగ) ఎక్కువగా ఆశిస్తుంది. దీని యొక్క లార్వాలు కాయలోకి చొచ్చుకు పోయి కుళ్లి పోయేలా చేస్తాయి. పురుగు ఆశించక ముందే 10 లీటర్ల నీటిలో 100 ఎంఎల్ మలాథియన్, 100 గ్రాముల బెల్లం కలిపి వెడల్పాటి పల్లెంలో ఈ ద్రావణం పోసి పంట చేనులో అక్కడక్కడ ఉంచాలి. పురుగు ఆశించిన తర్వాత నివారణకు వెంటనే లీటరు నీటికి 2ఎంఎంల్ మలాథియన్ లేదా 2 ఎంఎల్ క్లోరిపైరిపాస్ పిచికారీ చేయాలి. అలాగే తెల్లదోమ నివారణకు జిగురు కలిగిన పసుపు రంగు అట్టలను చేనులో ఏర్పాటు చేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 3ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 గ్రాముల ఎస్టమిప్రైడ్ కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు ఆశిస్తే లీటరు నీటికి 2 గ్రాముల పిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి.

మంచి లాభాలు ఉన్నాయి



వరి, పత్తి పంటల సాగుకు భిన్నంగా వేరే రకం పంటలు సాగు చేయాలని అనుకున్నా. మూడేళ్లుగా రెండెకరాల భూమిలో కర్బూజ సాగు చేస్తున్నా. మంచి లాభాలు ఉన్నాయి. వేసవిలో పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– కంకణాల లక్ష్మణ్‌రెడ్డి, కర్బూజ రైతు, ఒతుకులపల్లి

సలహాలు, సూచనలు ఇస్తున్నాం



కర్బూజ సాగులో మంచి లాభాలు ఉన్నాయి. రైతులు ముందుకు వచ్చి ఇలాంటి పంటలు సాగు చేసి అధిక లాభాలు గడించాలి. నియోజకవర్గ వ్యాప్తంగా కర్బూజ సాగు చేస్తున్న రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్


నేషనల్ మార్ట్‌లో చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ మార్ట్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. రోజు మాదిరిగానే నేషనల్ మార్ట్ సిబ్బంది సోమవారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చేసరికి సేఫ్టీలాకర్ ఓపెన్ అయి ఉండడంతో మేనేజర్ తుకారాం పోలీసులకు సమాచారం అందించాడు. లాకర్‌లో ఉన్న రూ.4.82 లక్షలు చోరీకి గురయ్యాయని మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. సీసీ ఫుటేజీలో రికార్డయిన లాకర్ ఓపెన్ చేస్తున్న దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఐటీడీఏ పీవోకు స్కోచ్ అవార్డు



ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గిరిజనులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. విధుల్లో చేరినప్పటి నుంచి గిరిజనులకు చేరువ కావడంతో పాటు గిరిజన విద్యార్థుల్లో పౌష్టికాహార నివారణకు రాష్ట్రంలో మొదటిసారిగా గిరిజన పోషణ మిత్ర, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు గిరిజన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంలో పీవో ముందు వరుసలో నిలిచారు. ఈ నెల 29న న్యూఢిల్లీలో ఇండియా హబిటాట్ సెంటర్‌లోని జకరంద హాల్‌లో ఐటీడీఏ పీవో అవార్డు అందుకోనున్నారు.

గిన్నిస్ రికార్డులో స్థానం జిల్లాకే గర్వకారణం



గుస్సాడీ బృందంతో కుమురంభీం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్

• కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ఆదివాసీ గిరిజనుల సంప్రదాయమైన గుస్సాడీ నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకోవడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన భీమయ్య కొలాం గుస్సాడీ బృందంతో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, గిరిజన సంఘాల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఢిల్లీలో 5 వేల మంది కళాకారులతో నిర్వహించిన కార్యక్రమంలో దంతన్‌పల్లి పీవీటీజీ కొలాం గుస్సాడీ బృందం నృత్య ప్రదర్శన రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించిందన్నారు. గిరిజనుల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. అనంతరం గుస్సాడీ బృంద సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సిడాం అర్జు, ఆత్రం గంగారాం, మడావి భీమ్‌రావు, కుర్సింగ మోతీరాం, ఆత్రం సంతోశ్, చహకటి దసరు, తదితరులు పాల్గొన్నారు.

గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కాసిపేట: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న మోసపూరిత కుట్రను రద్దుచేసి సింగరేణి టెండర్లలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి, ఇల్లందు మైన్‌లకు సింగరేణి టెండర్‌లలో పాల్గొనవద్దని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. తిరిగి అదే ప్రభుత్వం సింగరేణికి టెండర్ ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టెండర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె చేసి హక్కులు సాధించుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, గని ఫిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మీనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, నాయకులు నాగేశ్వరరావు, శ్రీహరి, రాజేందర్, సురేష్, సంతోష్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

22న ట్రిపుల్ ఐటీలో ఎస్‌డీజీ సమ్మిట్



లోగో ఆవిష్కరిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ)లో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ఈనెల 22న ఎస్‌డీజీ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు, కార్యాచరణ పరిష్కారాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ సమ్మిట్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్సిటీ విద్యార్థి జావేద్ నేతృత్వంలోని టీమ్ ట్రాన్స్‌ఫార్మ్ ఈ సమ్మిట్ నిర్వహిస్తుందన్నారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సహకార చర్య, వినూత్న పరిష్కారాల ప్రాముఖ్యతను ప్రొఫెసర్ గోవర్ధన్ నొక్కి చెప్పారు. ఈ సమ్మిట్ థీమ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల జీవితాల్లో అర్థవంతమైన మార్పు తీసుకురావడానికి సంస్థ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం సమ్మిట్ లోగోను విడుదల చేశారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీ దర్శన్, ఏవో రణధీర్ సాగి పాల్గొన్నారు.